సాక్షి
వికారాబాద్
ఆదివారం । 12 । ఫిబ్రవరి । 2023



రైతన్న ‘తెల్ల’బోయె

పత్తి ధరలు తగ్గుతుండటంతో రైతుల్లో ఆందోళన పెరుగుతోంది. పత్తి అమ్మే విషయంపై నిర్ణయానికి రాలేకపోతున్నారు. 8లో▸



1,297 కేసుల రాజీ

జాతీయ లోక్ అదాలత్ ద్వారా 1,297 కేసులకు రాజీ కుదిరిందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.సుదర్శన్ అన్నారు. 8లో▸



మూణ్నాళ్ల ముచ్చటేనా?

అనంతగిరి రైతు ఉత్పత్తిదారుల సంఘం పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్రస్తుతం కంపెనీ మూసేసే దశకు చేరింది. 9లో▸

న్యూస్‌రీల్

బాంబ్ స్క్వాడ్ తనిఖీలు



వికారాబాద్ రైల్వే స్టేషన్‌లో తనిఖీలు

అనంతగిరి: వికారాబాద్‌లోని బస్టాండ్, రైల్వే స్టేషన్లలో శనివారం బాంబ్ స్క్వాడ్ బృందం తనిఖీలు నిర్వహించింది. సాధారణ తనిఖీల్లో భాగంగా పట్టణంలోని రద్దీ ప్రదేశాలను క్షుణ్ణంగా చెక్ చేశారు. జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా సోదాలు చేపట్టామని ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. ఎవరైనా వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించినా, సూట్‌కేసులు, టిఫిన్ బాక్సులు వంటివి వదిలి వెళ్లినా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలన్నారు. లేదా 100కు డయల్ చేయాలని సూచించారు.

15నుంచి ప్రాక్టికల్ ఎగ్జామ్స్

వికారాబాద్ అర్బన్: ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఇంటర్ నోడల్ అధికారి ఎస్.శంకర్ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. జనరల్ కోర్సులకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా 39 కేంద్రాలు, ఒకేషనల్‌కు 11 పరీక్ష సెంటర్లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈనెల 15న ప్రారంభమయ్యే పరీక్షలు మార్చి 2న ముగుస్తాయని తెలిపారు. టైమ్ టేబుల్ వివరాలు, హాల్ టికెట్లను సంబంధిత కాలేజీల్లో పొందాలని సూచించారు. ఎలాంటి మాల్ ప్రాక్టీస్ జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎగ్జామినేషన్ చీఫ్ సూపరింటెండెంట్లకు సోమవారం మధ్యాహ్నం 2గంటలకు వికారాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శిక్షణ సమావేశం ఉంటుందని, ప్రతిఒక్కరూ విధిగా హాజరు కావాలని సూచించారు.

పర్యాటక అభివృద్ధికి సహకరించాలి



అనంతగిరి: వికారాబాద్ జిల్లాలో పర్యాటక అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అసెంబ్లీలో ప్రస్తావించారు. మండల హెడ్ క్వార్టర్లలో మినీ స్టేడియాలు నిర్మించాలని కోరారు. అనంతగిరి టూరిజం డెవలప్‌మెంట్‌లో భాగంగా సర్పన్‌పల్లి, కోట్‌పల్లి ప్రాజెక్టులను బోటింగ్ కేంద్రాలుగా అభివృద్ధి చేయాలన్నారు. ఇవి మంచి పిక్నిక్ స్పాట్లు అని తెలిపారు. 50నుంచి 60 ఎకరాల స్థలాన్ని అనంతగిరి ఆలయానికి కేటాయించి, ఎకో టూరిజం చేస్తే జిందాల్ తరహాలో అభివృద్ధి జరుగుతుందన్నారు.

క్రీడలతో ప్రత్యేక గుర్తింపు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మనోహర్‌రెడ్డి

కుల్కచర్ల: క్రీడల్లో సత్తాచాటే వారికి మంచి గుర్తింపు లభిస్తుందని డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. మాజీ మంత్రి కమతం రాంరెడ్డి స్మారకార్థం ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలను శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. క్రీడలతో స్నేహ సంబంధాలు మెరుగుపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి మహ్మదాబాద్ పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శేరిరాంరెడ్డి, వివేకానంద కళాశాల ప్రిన్సిపాల్ బాలయ్య, జెడ్పీ బాలుర పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ రవిచంద్ర, పరిగి బ్లాక్ టు అధ్యక్షుడు భరత్ కుమార్, యూటీఎఫ్ మండల అధ్యక్షుడు రమేష్, నాయకులు పట్లోళ్ల వెంకట్రాంరెడ్డి, కనకం మొగులయ్య, రాంచంద్రయ్య, నిర్వాహకులు కుమ్మరి స్వామి, మురళి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్‌లు రెండూ ఒక్కటే

- మాజీ ఎంపీ హన్మంతరావు

యాచారం: కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్ఎస్ రెండూ ఒక్కటేనని మాజీ ఎంపీ వి.హనుమంతరావు అన్నారు. మండల కేంద్రంలో శనివారం మాజీ ఎమ్మెల్యే ముదిరెడ్డి కోదండరెడ్డి నివాసంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్టీ అగ్రనేత చేపట్టిన జోడో యాత్రను స్ఫూర్తిగా తీసుకుని రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో హాత్ సే హాత్ జోడో యాత్ర చేపడుతున్నట్లు చెప్పారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కేంద్రం, రాష్ట్రంలో అధికారం తమదేనన్నారు.



పోడియంపై టాప్ త్రీ విజేతలు





ఆబాల గోపాలం.. ఆనందోత్సాహం..

రైడ్.. దౌడ్

సాగర్ తీరంలో వాయువేగం ● హోరెత్తిన ఫార్ములా ఇ- రేస్

- గంటకు పైగా పరుగులు తీసిన కార్లు
- మొదట ట్రయల్ రన్, అనంతరం క్వాలిఫయింగ్
- ఉత్కంఠ రేకెత్తించిన ప్రధాన పోటీలు
- మోటార్ స్పోర్ట్స్ ప్రియుల ఆనందోత్సాహాలు

సాక్షి, సిటీబ్యూరో: హుస్సేన్ సాగర్ తీరంలో ఇ- కార్ రేస్ హోరెత్తింది. నెక్లెస్ రోడ్డుపై మెరుపు వేగంతో పోరెత్తింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న మోటారు క్రీడా ప్రియులను కొన్ని గంటల పాటు హైదరాబాద్ వైపు దృష్టి మళ్లించింది. ప్రత్యక్షంగా వీక్షించిన వేలాది మంది సందర్శకులను ఆనందోత్సాహాల్లో ముంచెత్తింది. శనివారం నెక్లెస్ రోడ్డులోని స్ట్రీట్ సర్క్యూట్‌లో జరిగిన ప్రతిష్టాత్మక ఫార్ములా- ఇ అంతర్జాతీయ కార్ రేసింగ్ పోటీలకు సాధారణ ప్రేక్షకులతో పాటు సినీ, రాజకీయ, క్రీడా తదితర రంగాలకు చెందిన ప్రముఖులు సైతం పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పర్యావరణహిత ఎలక్ట్రిక్ వాహనాల ప్రాధాన్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పడమే లక్ష్యంగా భారత్‌లోనే మొదటిసారిగా నగరంలో జరిగిన ఫార్ములా - ఇ ప్రిక్స్ పోటీలు విజయవంతంగా ముగిశాయి. ఈ పోటీల్లో డీఎస్ ఆటో మొబైల్స్ నుంచి పాల్గొన్న రేసింగ్ డ్రైవర్ వర్జిన్ ప్రథమ స్థానంలో నిలిచారు. ఆ తర్వాత ఎన్విసాన్ నుంచి పాల్గొన్న క్యాస్ డీ ద్వితీయ స్థానంలో, డీఏ కోస్టా మూడో స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా విజేతలను మంత్రి కేటీఆర్ వీరిని ప్రత్యేకంగా అభినందించారు. వీరికి అవార్డులను అందజేశారు.



దూసుకుపోతున్న ఇ- రేసింగ్ కార్లు

ఉత్కంఠకు తెర..

నగరంలో ఏర్పాటు చేసిన పోటీల కోసం ప్రభుత్వం విస్తృతమైన ఏర్పాట్లు చేసింది. గత ఏడాది నవంబర్ నాటికే నెక్లెస్ రోడ్డులో 2.8 కి.మీ మేర ట్రాక్‌ను సిద్ధం చేయడంతో పాటు నవంబర్, డిసెంబర్ నెలల్లో రెండు దఫాలుగా ఇండియన్ రేసింగ్ కార్ పోటీలను నిర్వహించారు. ఫార్ములా-ఇ పోటీలకు వీటిని ట్రయల్స్‌గా భావించారు. మరోవైపు ఫార్ములా- ఇ గురించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పెద్ద ఎత్తున ప్రచారం చేపట్టారు. ఈ నెల మొదటి వారంలోనే మరోసారి ట్రాక్ పరిశీలనతో పాటు గ్యాలరీలు, బారికేడ్లు, పటిష్టమైన భద్రతా వ్యవస్థ వంటి అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు.

- పోటీల్లో భాగంగా శుక్రవారం ట్రయల్స్ జరిగాయి. శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ట్రయల్స్‌తో పాటు మధ్యాహ్నం క్వాలిఫైయింగ్ పోటీలను నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం 3.03 గంటలకు ప్రధాన పోటీ ఆరంభమైంది. గంటలకుపైగా ఉత్కంఠ భరితంగా సాగింది. మెరుపు వేగంతో ఒకదాన్ని మించి మరొకటి పరుగులు తీశాయి. 11 జట్లకు చెందిన 22 మంది రేసింగ్ డ్రైవర్లు తమ సత్తాను చాటుకొనేందుకు ప్రతి క్షణం పోటీపడ్డారు.

ఊడిపడిన విడిభాగాలు..

ఉత్కంఠభరితంగా సాగిన ఈ పోటీల్లో పలుమార్లు రేసింగ్ కార్లు ఒకదాన్నొకటి ఢీకొన్నాయి. అపరిమితమైన వేగంతో దూసుకొచ్చిన కార్లు కొన్ని ట్రాక్‌ను దాటి వెళ్లాయి. ముఖ్యంగా మలుపుల వద్ద ఇలాంటి ఇబ్బందులు ఏర్పడ్డాయి. తెలుగుతల్లి చౌరస్తా వద్ద మలుపు తిరిగే క్రమంలో కార్లు ఒకదాన్నొకటి ఢీకొనడంతో కొన్ని కార్ల ముందు భాగంలోని విడిభాగాలు ఊడిపడ్డాయి. అయినా డ్రైవర్లు వాహనాలను ముందుకు దూకించారు. మరోసారి ఓ కారు డివైడర్‌కు ఢీకొట్టడంతో డ్రైవర్ దాన్ని నిలిపివేశారు. తెలుగుతల్లి చౌరస్తా వద్ద మలుపు విశాలంగా ఉన్నప్పటికీ నిర్దేశించిన ట్రాక్‌లోనే కారు నడపాల్సి ఉండడంతో డ్రైవర్లు కొందరు వాహనాలను అదుపు చేయలేక నిబంధనలకు ఉల్లంఘించడం గమనార్హం.

వెల్లువెత్తిన యువోత్సాహం...

ఈ పోటీలను వీక్షించేందుకు ఏర్పాటు చేసిన గ్యాలరీల్లో యువోత్సాహం వెల్లువెత్తింది, శనివారం వీకెండ్ కావడంతో ఐటీ ఉద్యోగులు, వివిధ రంగాలకు చెందిన యువతీ యువకులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. పిల్లలు సైతం సందడి చేశారు. రయ్‌మంటూ దూసుకొచ్చే కార్లను చూసి పిల్లలు, పెద్దలు ఉత్సాహంతో కేరింతలు కొట్టారు. పరుగెత్తే కార్లను తమ మొబైల్ ఫోన్‌లలో బంధించేందుకు పోటీ పడ్డారు. సెల్ఫీలు తీసుకున్నారు. లుంబిని పార్కు సమీపంలోని తెలంగాణ అమరుల స్మారకంతో సెల్ఫీలు తీసుకొనేందుకు ఉత్సాహం చూపారు. నగరానికి చెందిన మోటారు స్పోర్ట్స్ అభిమానులతో పాటు ముంబై, బెంగళూరు తదితర నగరాలకు చెందిన వారూ పెద్ద సంఖ్యలో ఉన్నారు.

అభిమాన క్రికెటర్ సచిన్‌తో రామ్‌చరణ్

రామ్‌చరణ్ తన అభిమాన క్రికెటర్ సచిన్ టెండుల్కర్‌తో కలిసి ఈ- రేసింగ్‌ను వీక్షించారు. మొదటి నుంచి ఈ- ఫార్ములా రేస్‌ను నిర్వహించడానికి విశేష కృషి చేసిన రాష్ట్ర ఐటీ శాఖ యంత్రి కేటీఆర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.





నటుడు అఖిల్, మహేష్‌బాబు కుమారుడు గౌతం





మంత్రి కేటీఆర్, ఆయన సతీమణి శైలిమ



దుల్కర్ సల్మాన్



ఆనంద్ మహీంద్రా





కేటీఆర్ తనయ అలేఖ్య, కుమారుడు హిమాన్షు



నిర్మాత అల్లు అరవింద్



ఏపీ మంత్రి అమర్నాథ్



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



రాష్ట్ర మంత్రి జగదీష్‌రెడ్డి



జొన్నలగడ్డ సిద్ధు, రామ్‌చరణ్, ఎంపీ సంతోష్‌కుమార్



సినీ నటులు నాగ చైతన్య, నాగార్జున

కదిలేదే లేదు!

జిల్లాలో తిష్ట వేసిన అధికారులు

- ఏళ్ల తరబడి ఒకేచోట విధులు
- ప్రజా సమస్యలపై నిర్లక్ష్య ధోరణి
- అవినీతికి అడ్డాగా మారిన ప్రభుత్వ కార్యాలయాలు

పేరు	శాఖ	హోదా
రేణుకాదేవి	విద్య	డీఈఓ
గోపాల్	వ్యవసాయ	డీఏఓ
రవికుమార్	మెప్మా	డీఎం
రాజేశ్వర్	పౌరసరఫరాల	డీఎస్ఓ
చిన్నప్పలనాయుడు	రెవెన్యూ	తహసీల్దార్(తాండూరు)
శ్యాంసుందర్‌రావు	అటవీ	ఎఫ్ఆర్ఓ



తాండూరు: వివిధ శాఖల్లో పనిచేస్తున్న కొంతమంది ఉన్నత, ద్వితీయ శ్రేణి అధికారులు, సిబ్బంది ఏళ్ల తరబడి ఒకే చోట తిష్ట వేశారు. ప్రజలకు సత్వర సేవలను అందించాల్సిన వీరి తీరు సమస్యలను పెంచేలా చేస్తోంది. ప్రధానంగా రెవెన్యూ, గ్రామ పంచాయతీ, పోలీసు శాఖల్లో ఈ పరిస్థితి నెలకొంది. పలువురు ప్రజాప్రతినిధుల అండదండలతో అవినీతికి పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పైరవీలు చేయించుకుని పోస్టింగ్

జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న పలువురు అధికారులు ఏళ్లుగా కార్యాలయాల కుర్చీలకు అతుక్కుపోయారు. రాష్ట్ర రాజధానికి సమీపంలో ఉన్న వికారాబాద్ జిల్లా ఉద్యోగులకు అనువైన ప్రాంతంగా మారింది. గతంలో ఇక్కడ ఉద్యోగం చేసేందుకు వెనకాడిన వారు.. ప్రస్తుతం పైరవీలు చేయించుకుని ఇక్కడకు వస్తున్నారు. మరికొందరైతే తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి జిల్లాను వీడి వెళ్లడం లేదు. నాలుగేళ్లుగా ఒకే స్థానంలో పనిచేస్తున్న మండల స్థాయి నుంచి, జిల్లా అధికారుల వరకు ఉన్నచోట నుంచి కదలడం లేదు. మరోవైపు స్థానిక ఎమ్మెల్యేల సిఫారసుతో వచ్చిన అధికారులు సైతం మూడునాలుగేళ్లుగా ఒకే చోట విధులు నిర్వహిస్తున్నారు. దీర్ఘకాలంగా బదిలీ కాకపోవడంతో ప్రజా సమస్యలను లెక్కచేయడం లేదనే ఆరోపణలున్నాయి. మెప్మాతో పాటు తహసీల్దార్ కార్యాలయాలు, మండల పరిషత్‌లు, వ్యవసాయ, అటవీ శాఖల్లో పనిచేస్తున్న కొంతమంది అధికారులు ఏళ్లుగా ఒకే చోట ఉంటున్నారు.

ఆరోపణలున్నా.. అడ్డంగా దొరికినా

జిల్లాలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు అవినీతికి అడ్డాగా మారాయి. ప్రధానంగా రెవెన్యూ శాఖలో నెలకొన్న అనిశ్చితి కారణంగా అధికారులు ఆడిందే ఆట.. పాడిందే పాట అనే చందంగా మారింది. గతేడాది జిల్లాలో విధులు నిర్వహిస్తున్న పలువురు అధికారులు ఏసీబీ వలకు చిక్కారు. లంచాలు తీసుకుంటూ అడ్డంగా దొరికిపోయారు. తాండూరు మండలం గోనూరు గ్రామంలో ఓ భూ సమస్యను పరిష్కరిస్తానని స్థానిక రెవెన్యూ అధికారి.. ఓ వ్యక్తి నుంచి రూ.4 లక్షలు తీసుకున్నాడు. పని చేయకపోవడంతో డబ్బులు తిరిగివ్వాలని సదరు వ్యక్తి ఒత్తిడి చేశాడు. డబ్బులు తీసుకున్న అధికారి తిరిగి ఇవ్వకపోగా.. అధికార బలంతో బెదిరింపులకు పాల్పడుతున్నాడు. ఈ విషయమై బాధితుడు కలెక్టర్ కార్యాలయంతో పాటు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మరోవైపు జిల్లాకు అధిక ఆదాయం సమకూర్చే మైన్స్ శాఖలో సైతం కొన్నేళ్లుగా విధులు నిర్వహిస్తున్న అధికారినే కొనసాగించడం గమనార్హం.

847 మందికి ఊరట

- ప్రస్తుత బదిలీల్లో అవకాశం కల్పిస్తూ ప్రభుత్వ నిర్ణయం
- నేటినుంచి 14వరకు దరఖాస్తుల స్వీకరణ
- సొంత జిల్లా టీచర్లలో ఆందోళన

వికారాబాద్ అర్బన్: జీఓ 317 ద్వారా పక్క జిల్లాల నుంచి వచ్చిన ఉపాధ్యాయులకు ప్రస్తుత బదిలీల్లో అవకాశం లభించింది. తమకు అన్యాయం జరుగుతోందంటూ వీరు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో టీచర్ల ప్రమోషన్లు, బదిలీల ప్రక్రియ తాత్కాలికంగా బ్రేక్ పడిన విషయం తెలిసిందే. ట్రాన్స్‌ఫర్ల షెడ్యూల్ ఆగకూడదనే ఉద్దేశంతో.. 317 జీఓ ద్వారా ఇతర జిల్లాలకు వెళ్లిన టీచర్లకు సైతం అంతర్గత జిల్లా బదిలీల్లో అవకాశం కల్పిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. వీరంతా ఈనెల 12నుంచి 14వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోనున్నారు. దీనిద్వారా జిల్లాలోని సుమారు 847మంది ఉపాధ్యాయులకు ఊరట లభించింది. 317 జీఓలో భాగంగా 884 మంది టీచర్లు వికారాబాద్‌కు వచ్చారు. బదిలీల ప్రక్రియ ప్రారంభమైన వెంటనే 11 మంది ప్రభుత్వ ప్రత్యేక ఆర్డర్‌పై, మరో 26 మంది స్పౌజ్‌ను వినియోగించుకుని రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలకు వెళ్లారు. దీంతో మిగిలిన 847మంది టీచర్లకు ప్రస్తుత బదిలీల్లో చాన్స్ దక్కింది. ఇందులో ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్లు, పీఈటీలు, భాషా పండిట్లు ఉన్నారు. మొదటి షెడ్యూల్ ప్రకారం వీరికి బదిలీల్లో అవకాశం ఇవ్వలేదు. దీంతో కొందరు ఉపాధ్యాయులు హైకోర్టును ఆశ్రయించడంతో.. ఉమ్మడి జిల్లాలో చేసిన సర్వీసును పరిగణనలోకి తీసుకుని బదిలీ అవకాశం కల్పించాలని ఆదేశాలిచ్చారు. ఫలితంగా జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు మంచి ప్లేస్‌మెంట్ల కోసం దరఖాస్తు చేసుకునే వెసులుబాటు దక్కింది.



బదిలీల్లో అవకాశం కల్పించాలని ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు (ఫైల్)

సొంత జిల్లా వారిలో భయం

317లో వచ్చిన ఉపాధ్యాయులకు బదిలీల్లో అవకాశం ఇవ్వడంతో ఇన్నాళ్లు సొంత జిల్లాలో పనిచేసిన ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే మారుమూల మండలాల్లో పనిచేస్తున్న వారు ప్రస్తుత బదిలీల్లో పట్టణాలకు సమీపంగా రావాలని భావించారు. 317లో వచ్చిన 847 మంది ఉపాధ్యాయులు పోటీలో లేకుంటే తాము అనుకున్న స్థానం వచ్చేదనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. వీరి రాకతో పాయింట్ల పట్టికలో తాము వెనుకబడిపోతామని ఆందోళన చెందుతున్నారు. 317లో వచ్చిన వారంతా జూనియర్లని, వారంతా మొదటి కేటగిరీ నుంచి రావడంతో బదిలీల పాయింట్లలో వెనుకబడి ఉంటారని కొందరు ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఏదిఏమైనా కొత్త షెడ్యూల్ ప్రకారం ఈ నెల 21, 22 తేదీల్లో సీనియార్టీ తుది జాబితాను ప్రకటించిన తర్వాతే స్థానిక ఉపాధ్యాయుల ఆందోళనకు తెరపడనుంది.

క్లుప్తంగా

వడ్డెర సమస్యలు పట్టని సర్కార్



మాట్లాడుతున్న అంజిలయ్య

అనంతగిరి: ప్రభుత్వాలు మారిన మా బతుకులు మారడం లేదని వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు వీఆర్ అంజిలయ్య అన్నారు. ఈ మేరకు శనివారం తమ డిమాండ్‌ల సాధనకు చేపట్టిన చలో అసెంబ్లీ చేపట్టడంతో ముందస్తుగా వికారాబాద్ పోలీసులు వడ్డెర సంఘం ప్రతినిధులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా అంజిలయ్య మాట్లాడుతూ వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలన్నారు. మైనింగ్ హక్కులు కల్పించాలన్నారు. మా పిల్లలకు వివిధ హాస్టళ్లలో రిజర్వేషన్ కల్పించాలన్నారు. రాజకీయంగా గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భార్యపై దాడిచేసిన భర్తకు రిమాండ్

పరిగి: తాగిన మైకంలో నిత్యం భార్యను వేధిస్తున్న భర్తను రిమాండ్‌కు తరలించిన ఘటన శనివారం మిట్టకోడూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన చిన్న రాములు మద్యానికి బానిసై నిత్యం భార్య అనురాధను కొడుతున్నాడు. ఈ క్రమంలో ఈనెల 4న ఇటుకతో తలపై కొట్టగా తీవ్ర గాయాలయ్యాయి. బాధితురాలు చికిత్స చేయించుకుని శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్ చేసినట్లు తెలిపారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోండి

ఇబ్రహీంపట్నం రూరల్: కోర్టు ఆదేశాలను ధిక్కరించి ఎలాంటి అనుమతులు లేకుండా రెడీమిక్స్ కాంక్రీట్ ప్లాంట్‌ను నిర్మాణం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కొంతం మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం బొంగ్లూర్‌లో ఆయన మాట్లాడుతూ.. మంగళపల్లి రెవెన్యూ పరిధిలో 155లో అనుమతులు లేకుండా ఏర్పాటు చేస్తున్న కాంక్రీట్ ప్లాంట్‌ను నిలిపివేయాలని కోరారు. ఈ వ్యవహారంపై ఆదిబట్ల మున్సిపల్ కమిషనర్‌కు, ఆదిబట్ల పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. 6 ఎకరాల పొలం వ్యవహారంపై కోర్టులో ఇంజక్షన్ ఆర్డర్ ఉన్నప్పటికీ నిర్మాణాలు చేపట్టడం ఎంతవరకు సమంజసమన్నారు. ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఇంటి నిర్మాణానికి చేయూత

తలకొండపల్లి: నిరుపేదల ఇంటి నిర్మాణాలకు ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ చేయూత నందిస్తున్నారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో సుమారు 500మంది నిరుపేదల ఇండ్లను ఉప్పల ట్రస్టు ఆధ్వర్యంలో నిర్మిస్తున్నారు. మండలంలోని పాతకోటతండాకు చెందిన పాత్లావత్ పీర్య ఇంటి నిర్మాణం కోసం శనివారం ట్రస్టు సభ్యులు సిమెంట్, స్టీల్, ఇసుక, ఇటుక, తదితర సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు తావుర్యా, రాజేశ్, హూబ్లా, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మా.. చల్లంగ చూడమ్మా

ఘనంగా అమ్మవారి రథోత్సవం

జమిడికెలు.. డప్పుల మోతలు.. డోలువాయిద్యాలు.. శివసత్తుల శిగాలతో ఎల్లమ్మ తల్లీ రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. శనివారం పోలెపల్లి జాతరలో అమ్మవారు తేరుపై నుంచి భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తరించారు. ఉదయం నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి కోనేరు స్నానాలు చేసి ఆలయం చుట్టూ ప్రదక్షిణల చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ ముచ్చటి వెంకటేశ్, మాజీ చైర్మన్ రామకృష్ణారెడ్డి, ఆలయ మేనేజరు రాజేందర్‌రెడ్డి, రేణుక ఎల్లమ్మ యువజన సంఘం అధ్యక్షుడు బుగ్గప్ప, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. – బొంరాస్‌పేట



అమ్మవారి రథోత్సవంలో పాల్గొన్న భక్తజనం



బోనంతో ప్రదక్షిణ చేస్తూ..



అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు



విద్యుత్ కాంతుల్లో ఆలయం

రెండో విడత గొర్రెల పంపిణీ చేపట్టాలి

బొంరాస్‌పేట: రెండో విడత గొర్రెల పంపిణీ వెంటనే చేపట్టాలని బీసీ సంఘం డిమాండ్ చేసింది. శనివారం ఆసంఘం నాయకులు మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. బీసీ సంఘం తాలూకా అధ్యక్షుడు మన్నె బస్వరాజ్ యాదవ్ మాట్లాడుతూ ప్రస్తుత అసెంబ్లీ సమావేశాలు, బడ్జెట్‌లో గొర్రెల పంపిణీ ప్రస్తావన రాకపోవడం బాధాకరమన్నారు. గొర్రెల పంపిణీ చేపట్టకపోవడంతో గొల్ల కురుమ కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నాయన్నారు. లబ్ధిదారులను గుర్తించి వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లోకి డబ్బులు జమచేయాలన్నారు. సమావేశంలో ఆసంఘం నాయకులు బల్ల యాదగిరి పటేల్, వెంకటేశ్, డాక్టర్ వెంకటయ్య, తదితరులున్నారు.



మాట్లాడుతున్న బస్వరాజ్ యాదవ్

ఘనంగా రుద్రహోమం



హోమంలో పాల్గొన్న భక్తులు, వీరశైవ సమాజం సభ్యులు

కుల్కచర్ల: మండల పరిధిలోని ఇప్పాయిపల్లిలో రుద్రహోమం వైభవంగా నిర్వహించారు. భ్రమరాంబమల్లికార్జున స్వామి విగ్రహ పునఃప్రతిష్ఠాపన ఉత్సవాలలో భాగంగా శనివారం గణపతి హోమం, రుద్ర హోమం, సిద్ధహోమం, పురుషోత్తమ హోమం, స్వామివారికి మహాఘటాబిషేకం కార్యక్రమాలను నిర్వహించారు. ఉత్సవాలతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. వీరశైవ సమాజం సంఘం ఆధ్వర్యంలో పూజాకార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

ధర లేకపాయె.. రైతన్న 'తెల్ల'బోయె

ఇళ్లలోనే పత్తి నిల్వలు
- విక్రయంపై ఊగిసలాట
- నిలువుదోపిడీకి పాల్పడుతున్న దళారులు

దోమ : పత్తి ధరలు తగ్గుతుండటంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. దీంతో పత్తి అమ్మే విషయంపై అయోమయానికి గురవుతున్నారు. ధర పెరుగుతుందన్న ఆశలు పెట్టుకున్నా చివరికి కన్నీళ్లే మిగులుతున్నాయని ఆవేదన చెందుతున్నారు. వానకాలం సీజన్‌లో మండల వ్యాప్తంగా రైతులు ఎక్కువగా పత్తి పంటను సాగు చేశారు. రెండేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం పత్తి పంటను ప్రోత్సహిస్తుండడంతో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. వర్షాలు అధికంగా కురవడంతో పత్తి పంట కొంత నష్టం కలిగింది. దీంతో రైతులకు ఆశించిన దిగుబడులు రాలేదు. గిట్టుబాటు ధర వస్తుందన్న ఆశతో పత్తిని ఇళ్లలోనే నిల్వ ఉంచుకున్నా, రోజు రోజుకు ధరలు పడిపోతుండడంతో దళారులను ఆశ్రయించి పత్తిని విక్రయించుకోవల్సిన దుస్థితి ఏర్పడుతోంది.

చివరికి కన్నీళ్లే..

పత్తి పంటకు మొదట్లోనే మంచి ధరలు పలికినా.. చివరికి రైతులకు కన్నీళ్లే మిగులుతున్నాయి. నవంబర్ నెలలో క్వింటాలు పత్తికి రూ.9,400 నుంచి రూ. 9,600 వరకు పలికింది. ఆ ధరలు క్రమ క్రమంగా తగ్గుతూ వస్తున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో పత్తి ధర క్వింటాలుకు రూ.7,700 ఉంది. పత్తి నాణ్యతను బట్టి ధరలు వెచ్చిస్తామని మిల్లు యజమానులు రైతులకు సూచిస్తున్నారు.

దళారుల హవా!

పత్తి కొనుగోళ్లలో దళారుల హవా కొనసాగుతోంది. ఆరుగాలం శ్రమించి పత్తిని పండించిన రైతులను దళారులు నట్టేటముంచుతున్నారు. దళారులు నేరుగా రైతుల వద్దకే వచ్చి పత్తిని కొనుగోలు చేస్తున్నారు. క్వింటాలు పత్తికి మార్కెట్‌లో రూ.7,700 ఉండగా, రైతుల నుంచి రూ. 7,500లకు కొనుగోలు చేస్తున్నారు. అదే కాకుండా తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. తేమ పేరుతో క్వింటాలుకు 4 కిలోల పత్తిని అదనంగా తీసుకుంటున్నారు. ధర తక్కువ, తూకం ఎక్కువ చేస్తూ రైతులను నిలువుదోపిడీకి పాల్పడుతున్నారు. ప్రభుత్వం దళారుల వ్యవస్థను అరికట్టి, మద్దతు ధరను పెంచేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.



గ్రామంలో రైతుల నుంచి పత్తిని కొనుగోలు చేస్తున్న దళారులు

మద్దతు ధర రూ.10 వేలు ప్రకటించాలి



ఆరుగాలం శ్రమించి పత్తి పంటను పండిస్తే ధర లేక నానా ఇబ్బందులు పడుతున్నాం. తెచ్చిన అప్పులు కూడా తీరడం లేదు. ప్రభుత్వం పత్తికి రూ.10 వేల మద్దతు ధర ప్రకటిస్తే మేలు చేకూరుతుంది. పలువురు రైతులు దళారులను ఆశ్రయించి తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వం దళారుల వ్యవస్థను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలి. – బషీర్, రైతు, బొంపల్లి

1,297 కేసులు రాజీ

జాతీయ లోక్‌అదాలత్‌లో కుదిరిన సయోధ్య
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి సుదర్శన్ వెల్లడి
- బాధ్యతగా మెలిగితే నేరాలు జరగవని హితవు



లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న జిల్లా న్యాయమూర్తి సుదర్శన్

వికారాబాద్ అర్బన్: జాతీయ లోక్ అదాలత్ ద్వారా 1,297 కేసులకు రాజీ కుదిరిందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.సుదర్శన్ అన్నారు. జిల్లా న్యాయసేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం వికారాబాద్ కోర్టు ఆవరణలో లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ బాధ్యతగా, క్రమశిక్షణగా వ్యవహరిస్తే నేరాలు తగ్గుముఖం పడుతాయని తెలిపారు. భూ, ఆస్తి సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని సూచించారు. సమస్యను సాగదీసి పంతాలకు పోవద్దని తెలిపారు. కోర్టుల చుట్టూ తిరుగుతూ బంధాలను దూరం చేసుకోవద్దని తెలిపారు. మనిషికి స్వార్థం ఎక్కువైనకొద్దీ ఆస్తులపై ఆశ పెరుగుతోందన్నారు. ఇటీవలి కాలంలో కోర్టుకు భూ సమస్యలు ఎక్కువగా వస్తున్నాయని తెలిపారు. భూమి ధరలు పెరగడంతో తోబుట్టువులు కోర్టు మెట్లు ఎక్కుతున్నారన్నారు. ఈ కారణంగా అన్నాదమ్ముళ్లు, అక్కాచెల్లెల మధ్య బంధాలు తెగిపోతున్నాయని గుర్తు చేశారు. వికారాబాద్ కోర్టులో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో 215 కేసులకు రాజీ కుదిర్చినట్లు వివరించారు. వికారాబాద్, పరిగి, తాండూరు, కొడంగల్ కోర్టుల్లో కలిపి మొత్తం 1,297 కేసులకు రాజీ కుదిరిందన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవా అధికార సంస్థ సెక్రటరీ సీనియర్ సివిల్ జడ్జి డీబీ శీతల్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీకాంత్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.





చెన్నారెడ్డి, ఎన్టీఆర్ విగ్రహాలకు ముసుగులు

కోడ్ కూసింది.. ముసుగు పడింది

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కూయడంతో నాయకుల విగ్రహాలకు ముసుగులు పడ్డాయి. ఎన్నికల కోడ్ నిబంధనలో భాగంగా జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్, చెన్నారెడ్డి విగ్రహాలకు మున్సిపల్ సిబ్బంది ముసుగులు వేశారు. పట్టణంలోని పలు కూడళ్లలో ఉన్న రాజకీయ నాయకులు ఫ్లెక్సీలను కూడా తొలగించారు. ఎన్నికల కోడ్ ముగిసే వరకు రాజకీయ నాయకులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయరాదని అధికారులు తెలిపారు. – వికారాబాద్ అర్బన్

ధరణితో తంట.. గుండె మంట

వెల్లువలా భూ సమస్యలు
- న్యాయ శిబిరానికి తరలివచ్చిన రైతులు
- పరిష్కారం కావడంలేదంటూ కన్నీరుమున్నీరు
- భూ సర్వే చక్కని మార్గమన్న న్యాయ నిపుణులు



యాచారంలో నిర్వహించిన భూ న్యాయ శిబిరంలో రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న న్యాయనిపుణులు

యాచారం: కేసీఆర్ సర్కార్ తెచ్చిన ధరణి పోర్టల్‌తో భూ సమస్యలు పెరుగుతున్నాయే కానీ, పరిష్కారం కావడంలేదని రైతులు వాపోతున్నారు. తమ భూములకు పట్టాదారు పాసుపుస్తకాలు వస్తాయా రావా?.. ధరణిలో తమ పేర్లు నమోదు అవుతాయోలేదోనని ఆందోళన చెందుతున్నారు. యాచారం మండల కేంద్రంలో శనివారం లీఫ్స్, గ్రామీణ న్యాయ పీఠం, తెలంగాణ సోషల్ మీడియా ఫోరం సంస్థ ఆధ్వర్యంలో భూ న్యాయ శిబిరం జరిగింది. ఈ శిబిరానికి ప్రముఖ భూచట్టాల నిపుణులు, న్యాయవాది, నల్సార్ విశ్వవిద్యాలయం అనుబంధ ఆచార్యులు సునీల్, మాజీ ఆర్డీఓ లచ్చిరెడ్డి, సోషల్ మీడియా ఫోరం రాష్ట్ర కన్వీనర్ కరుణాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ముదిరెడ్డి కోదండరెడ్డి, కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి, పలువురు భూ చట్టాల నిపుణులు హాజరయ్యారు. ఈ భూ న్యాయ శిబిరానికి యాచారం, మంచాల, కందుకూరు, ఇబ్రహీంపట్నం, మాడ్గుల్ తదితర మండలాల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు తరలివచ్చి తమ భూ సమస్యలపై ఫిర్యాదు చేశారు. ధరణి పోర్టల్‌లో భూ రికార్డులు నమోదు కావడం లేదని, పట్టా భూములు అసైన్డ్ భూములుగా రికార్డుల్లో మారాయని, ధరణిలో మా భూముల రికార్డులు కనిపించడం లేదని, పట్టా భూములకు బదులు భూదాన్ భూములుగా నమోదు అయ్యాయని, మా పట్టా భూములు ఇతర రైతుల పేర్ల మీద మార్చబడినట్లు, మా భూములను నిషేధిత జాబితాలో చేర్చినట్లు ఇలా అనేక భూ సమస్యలపై న్యాయ శిబిరంలో రైతులు ఫిర్యాదులు చేశారు. భూ సమస్యలపై రెవెన్యూ అధికారులను కలిస్తే మీ సేవా కేంద్రాల్లో అర్జీలు పెట్టుకోవాలని సలహాలిస్తే డబ్బులు చెల్లించి అప్పుల పాలవుతున్నామని, పైగా సమయం మొత్తం వృథా అవుతోందని రైతులు కన్నీటిపర్యంతమయ్యారు. నిరుపేద రైతుల నుంచి ఉన్నత చదువులు చదివిన వ్యక్తుల వరకు తమ భూ సమస్యలపై ఫిర్యాదులు చేశారు. రైతుల ఫిర్యాదులపై భూ చట్టాల న్యాయ నిపుణులు సలహాలు, సూచనలు చేసారు. కొన్ని భూ సమస్యలను మేమే పరిష్కరించే విధంగా కృషి చేస్తామని స్వీకరించారు.

భూసర్వేనే చక్కని పరిష్కారం

భూసమస్యలకు చక్కటి పరిష్కారాం సమగ్ర సర్వే, హద్దులు గుర్తించడమేనని ప్రముఖ భూ చట్టాల న్యాయ నిపుణులు, నల్సార్ విశ్వవిద్యాలయం అనుబంధ ఆచార్యులు సునీల్ అన్నారు. 124 భూ చట్టాలు ఉంటే రాష్ట్ర సర్కార్ ధరణి చట్టాన్ని తెచ్చి మిగతా చట్టాలను పాతరేసిందని అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి పెద్ద సమస్య ధరణి పోర్టలే అవుతుందని అన్నారు. మాజీ ఆర్డీఓ లచ్చిరెడ్డి మాట్లాడుతూ.. ధరణి పోర్టల్‌లో ప్రక్షాళన జరిగాల్సిందేనని అన్నారు.

రైతులను మోసం చేస్తున్న సర్కార్

ఏపీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి భూ సర్వే చేస్తూ, హద్దులు గుర్తిస్తూ రైతులకు టైటిల్‌తో కూడిన పట్టాదారు, పాసుపుస్తకాలు ఇస్తున్నారని, కానీ తెలంగాణలో మాత్రం సీఎం కేసీఆర్ ధరణి పోర్టల్ తెచ్చి రైతులను మోసం చేస్తున్నారని ఏఐసీసీ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ముదిరెడ్డి కోదండరెడ్డి అన్నారు. భూసర్వే, భూ హద్దుల గుర్తించడం కోసం కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా రాష్ట్ర ప్రభుత్వం పక్కదారి పట్టించిందని మండిపడ్డారు.

మెట్లకుంటలో దొంగల హల్‌చల్

పలువురి ఇళ్లలో చోరీలు
- భారీగా నగలు, నగదు అపహరణ

బొంరాస్‌పేట: మండల పరిధిలోని మెట్లకుంటలో దొంగలు హల్‌చల్ చేశారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో పలువురి ఇళ్లలో శుక్రవారం రాత్రి దొంగతనాలు జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. ఉపాధ్యాయుడు సుధాకర్ ఇంట్లో దొంగలు చొరబడి కోళ్లను అపహరించారు. మాల వినోద్ ఇంట్లో బీరువాను పగులకొట్టి ఆరు తులాల బంగారం, 40తులాల వెండి, రూ. 10లక్షల నగదు దొంగిలించారని బాధితులు తెలిపారు. మరో రెండు ఇళ్లలోనూ చోరీ జరిగింది. పోలీసుల గస్తీ లేకపోవడమే ఇందుకు కారణమని బాధితులు చెబుతున్నారు. బాధితుల నుంచి ఫిర్యాదు అందిందని ఎస్‌ఐ తెలిపారు.



ధ్వంసమైన బీరువా

తెలంగాణ మోడల్‌పై దేశవ్యాప్త చర్చ



మాట్లాడుతున్న వెంకటరమణారెడ్డి

ఇబ్రహీంపట్నం: తెలంగాణ మోడల్ అభివృద్ధిపై, బీఆర్‌ఎస్ విధి విధానాలపై దేశ వ్యాప్తంగా చర్చ జరుగుతున్నదని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం మండల బీఆర్‌ఎస్ కార్యవర్గ సమావేశం ఆ పార్టీ నేత చిలుకల బుగ్గరాములు అధ్యక్షతన శనివారం స్థానిక వైష్ణవి గార్డెన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తు మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమ పథకాలపై చర్చించడానికి విపక్షాలకు దమ్ములేకనే తిట్టడమే రాజకీయమన్నట్లుగా వ్యవహరిస్తున్నాయని దుయ్యబట్టారు. అనంతరం ఎంపీపీ కృపేశ్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి తనయుడు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్‌రెడ్డి చేపట్టిన ప్రగతి నివేదన యాత్ర ఈనెల 14నుంచి ఇబ్రహీంపట్నం మండలంలోకి అడుగుపెట్టనున్నదని తెలిపారు. పదిరోజుల పాటు మండలంలో ఈ యాత్ర కొనసాగుతుందని పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మండల వైస్ ఎంపీపీ మంచిరెడ్డి ప్రతాప్‌రెడ్డితో పాటు పార్టీ నాయకులు కాలే గణేశ్, జగన్నాథం, నర్సింహ, సర్పంచ్‌లు భాస్కర్‌గౌడ్, గీతారాంరెడ్డి, జ్యోతిరాజు, పవిత్రకుమార్, యాదగిరి, హంసమ్మ, ఎంపీటీసీలు మంగ రవీందర్, అచ్చన శ్రీశైలం, నాగమణి పాల్గొన్నారు.